క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లైన్ల నిర్వహణలో భాగంగా మంగళవారం చిట్టినగర్ సబ్ స్టేషన్ పరిధిలోని రాజీవ్‌శర్మనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వహణాధికారి బీవీ సుధాకర్ పేర్కొన్నారు. వీజీఎస్ పబ్లిషర్స్, సౌమ్య థియేటర్, కోస్టల్ స్కూల్ ప్రాంతం, సీఎం ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు. కుమ్మరి పాలెం, నాలుగు స్థంభాల సెంటర్, గుప్త సెంటర్, సాయిబాబా గుడి ప్రాంతం, చెరువు సెంటర్, కొండ బడి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌కు పరామర్శ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కావలిలో అల్లరిమూకల దాడిలో గాయపడిన ఆర్టీసీ డ్రైవర్ బి.రామ్‌సింగ్‌ను ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం పరామర్శించారు. విద్యాధరపురంలోని సెంట్రల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న రామ్‌సింగ్‌ను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి. వెంకటపతి, సభ్యులు ఎం.రామకోటేశ్వరరావు ఉన్నారు. రామ్‌సింగ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు అసోసియేషన్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

విజయవాడ ఆర్ట్ సొసైటీకి ఆర్ట్ గెలాక్సీ అవార్డ్



విజయవాడ కల్చరల్: ఒంగోలుకు చెందిన సృష్టి ఆర్ట్స్ అకాడమీ సంస్థ చిత్ర కళా రంగానికి చేస్తున్న సేవలను గుర్తించి 2023 సంవత్సరానికి గానూ ఆర్ట్ గెలాక్సీ పురస్కారానికి ఎంపిక చేసినట్లు విజయవాడ ఆర్ట్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి యు.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ గెలాక్సీ సంస్థ ఏటా ఒంగోలులో ఆర్ట్స్ వర్క్ షాప్ నిర్వహించి విశిష్టమైన సేవలను అందించి వారికి అవార్డ్‌ను అందజేస్తుందని తెలిపారు. ఒంగోలులో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అంజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కొలుసు సుబ్రహ్మణ్యంతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

6 నుంచి శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో నవంబర్ 6వ తేదీ నుంచి ఎం.ఎస్ ఆఫీస్ కొత్త బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నమని ఎం.బి.విజ్ఞాన కేంద్రం శిక్షణా విభాగం బాధ్యుడు టి.క్రాంతికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సహకారంతో జరుగుతున్న ఈ శిక్షణ తరగతులు రెండు నెలల పాటు ప్రతి రోజు రెండు గంటలు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు నవంబర్ 4వ తేదీలోగా 0866 2578044, 94900 98042 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

అక్కినేని భావినటులకు మార్గదర్శకం

విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నటజీవితం భావి నటులకు మార్గదర్శకమని సీనియర్ గాయకుడు చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు ముగింపు వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని ప్రారంభదశలో చిన్నపాత్రలు పోషించినా స్వయం కృషి, పట్టుదలతో తెలుగు సినిమా గర్వించే స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో రూపాశ్రీ, విష్ణు ప్రియ, సుధా శ్రీనివాస్, వాసిరెడ్డి శ్రీనివాస్, రసూల్‌బాబు, సత్యవర్ధన్, సుశీల్‌కుమార్ అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు.

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు

వీరులపాడు: మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సోమవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఉక్కుపాదం మోపుతున్నట్లు వివరించారు.

వైద్యం భారం కాకూడదనే 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- డివిజన్లలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలకు వైద్యం నిమిత్తం చేసే ఖర్చు భారం కాకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 44వ డివిజన్‌లోని 157వ సచివాలయం పరిధిలోని ప్రజల కోసం విద్యాధరపురం లేబర్‌కాలనీలోగల వీఎంసీ కల్యాణ మండపంలో, అదే విధంగా 45వ డివిజన్‌లోని 136 సచివాలయం పరిధిలోనివారి కోసం కబేళారోడ్‌లో జెఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ గృహ సముదాయంలో ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌లను ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 44, 45 డివిజన్ల కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్యలతో కలిసి సందర్శించారు. ఆయా హెల్త్ క్యాంప్‌లకు వచ్చి ప్రజలతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందిస్తున్నారని ఆరా తీశారు. అలాగే వైద్యులు, సిబ్బందిని కలిసి ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన ప్రజలను సాదరంగా పలకరించి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని వాటికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించటంతోపాటు మందులు కూడా అందచేయాలని ఆదేశించారు. హెల్త్ క్యాంప్‌లకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఉపశమనం పొంది సంతృప్తికరంగా వెళ్లేలా చూడాలని సూచించారు. అలాగే వారు చెప్పే ఆరోగ్య సమస్యలను సావధానంగా ఆలకించి పరిష్కారం చూపాలి తప్ప విసుక్కోవటం, నిర్లక్ష్యంగా ఉండటం తగదన్నారు.

ఆరోగ్య ప్రదాత వైఎస్ రాజశేఖరరెడ్డి....

పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఆరోగ్య ప్రదాత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అన్ని వెలంపల్లి అన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో లేని వైద్య చికిత్సల కోసం ప్రభుత్వ ఆసుపత్రి, ఆరోగ్య శ్రీ హాస్పటల్స్‌కు రిఫర్ చేసి అక్కడ వైద్యం ఉచితంగా చేస్తారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లు అనేవి ఈ ఒక్క రోజు మాత్రమే ఉండేవి కావని, మీ ఆరోగ్యానికి సంబంధించిన డేటా మొత్తం అక్కడ ఉంటుందని చెప్పారు. దానిని బట్టి క్యాంప్ లేని రోజుల్లోనూ అర్బన్ హెల్త్ సెంటర్లకు వస్తే ట్రీట్‌మెంట్ చేస్తారన్నారు. ఆరోగ్యపరంగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలందరికి ఒక వరం అని అన్నారు. ప్రైవేట్ హాస్పటల్స్‌లో ఉన్నట్లే ఇక్కడ కూడా స్పెషలిస్ట్ వైద్యులు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య, పార్టీ నాయకులు మైలవరపు దుర్గారావు, వల్లం రవికుమార్, పెద్దిరాజారావు, ఎస్ సాయి, ఏజీఎల్ నారాయణ, ఎ పూర్ణ కనకారావు, శర్మ, ముత్తా వాసు, ముత్యాల రాంబాబు, బోర మల్లేశ్వరరెడ్డి, దుర్బేసుల హుస్సేన్, నల్లం వాసు, బైపినేని కోటేశ్వరరావు, టి.లక్ష్మణ్, డి.రాము, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



45వ డివిజన్‌లో మందుల కిట్ అందచేస్తున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి, మాధురి లావణ్య

ఆరోగ్యానికి భరోసా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించే దిశగా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోందని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలోని 37వ డివిజన్‌లోని 275వ సచివాలయం పరిధిలో సుబ్బరామయ్య హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఏపీ జైన్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వించిపేటలోని 54వ డివిజన్ 187వ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు స్థానిక కార్పొరేటర్ అబ్దుల్ ఆర్షద్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. నాయకులు అతీక్ తదితరులు పాల్గొన్నారు.



44వ డివిజన్‌లో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి, రత్నకుమారి



అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న వెలంపల్లి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం లోని 41, 43 డివిజన్లలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. శిభిరాలను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ప్రవేశపెట్టి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించారని తెలిపారు. ఆయన తనయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు అడుగులు ముందుకు వేసి ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. శిభిరాల్లో వైద్య అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ప్రభుత్వాసుపత్రులు, ఆరోగ్య శ్రీ ఆసుపత్రులకు పంపి వైద్యం అందిస్తారన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

అభివృద్ధికి చిరునామా.. పశ్చిమ నియోజకవర్గం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దామని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం 42వ డివిజన్‌లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి సోమవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. డివిజన్‌లోని టెలీఫోన్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 42 డివిజన్ పరిధిలోని రూ. 1.13 కోట్లతో చేపట్టిన టెలిఫోన్ కాలనీ మెయిన్ రోడ్ , శ్రీ సాయి అవెన్యూ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీలోని కళ్యాణ మండపం మొదటి అంతస్తు , రైతు బజార్ రోడ్ పేవర్ బ్లాక్స్ ఏర్పాటు, వైఎస్సార్ సీపీ ఆఫీస్ పక్కన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఈ విధంగా ఉండాలి అనే విధంగా రోడ్లు, డ్రెయినేజీలు తీర్చిదిద్దామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత విజయవాడలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. గత పాలనకు, ఈ పాలనకు పోల్చి చూస్తే ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. అవకాశం ఉన్న మేరకు సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, పార్కులు, కమ్యూనిటి హాల్స్ నిర్మాణం చేశామన్నారు. కార్పొరేషన్ నిధులు వెచ్చించి పశ్చిమ నియోజకవర్గాన్ని వేగంగా అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గానికి గడప గడపలో పనులన్నీ చాలా వరకు ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్ రూ. 18 కోట్లు కేటాయించారన్నారు. అవే కాకుండా నగర పాలక సంస్థ నిధులు అన్ని అభివృద్ధికి ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ చేస్తున్నామని వివరించారు. కార్పొరేటర్ పడిగపాటి చైతన్య రెడ్డి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ తనబుద్ది శేఖర్ రెడ్డి, పడిగపాటి సుబ్బారెడ్డి, బండారి వెంకట్, అబ్దుల్ అజీజ్, శంకర్ రెడ్డి, కాపులపల్లి శ్రీనివాస రెడ్డి, పువ్వాడ వెంకటేశ్వరరావు, ప్రతాప్ రెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతు బజార్‌లో ప్రజల తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

స్మృతివనం పనులు పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. వందలాది మంది కార్మికులు భారీ యంత్రాలతో నిరంతరం పనులను కొనసాగిస్తున్నారని చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతివనం నిర్మాణ డిజైన్ల ఆధారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచామని తెలిపారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. గ్రానైట్, ఫుట్ పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. పార్కింగ్ ఏరియా సిద్ధం చేస్తున్నామని, ఈ ప్రాంగణంలో అంద మైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



స్మృతివనం పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సంతృప్తికర పరిష్కారాలే లక్ష్యం

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న స్పందనలో పరిష్కారాలు లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు దారులకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని సూచించారు. సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందనలో మొత్తం 25 సమస్యలపై ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగం-9, ఇంజనీరింగ్ విభాగం-9, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)-4, రెవెన్యూ-1, ఎస్టేట్ విభాగం-1, ఇతర -1 కు సంబంధించి అందుకున్న సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్లు కేవీ సత్యవతి, పట్టణ సాధికారాభివృద్ధి అధికారి శకుంతల, డెప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మీ, సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, సీఈ ప్రభాకర్ తదితరులున్నారు.



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఫిట్ ఇండియా.. స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫిట్ ఇండియా స్వచ్ఛతా 4.0 రన్‌లో భాగంగా విజయవాడ కెనరా బ్యాంక్ సర్కిల్ ఆధ్వర్యాన ఫిట్ ఇండియా.. స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్ సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ రవివర్మ పాల్గొని స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌ను జెండా ఊపి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని అన్నారు. ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతులుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నేటి జీవన శైలిలో ప్రతి ఒక్కరు ఎన్నో ఒడిదుడుకులతో అనారోగ్య సమస్యలకు గురవుతూ రోగాల పాలవుతున్నారని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని ప్రతీ ఒక్కరు పాటించి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఏదో ఒక రకమైన వ్యాయామాన్ని ప్రతి రోజూ అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ మేనేజర్ రామారావు, బ్యాంకు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫిట్ ఇండియా.. స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్

ప్రకృతి వైపరీత్యాలతో అప్రమత్తం

ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మిదిలీష్ యాదవ్

పెనమలూరు: ప్రకృతి వైపరీత్యాల కారణంగా తలెత్తే ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ప్రమాదం నుంచి బయటపడాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ మిదిలీష్ యాదవ్ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల నుంచి బయటపడటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో గ్యాస్ సిలెండర్ ప్రమాదాల విషయంలో కూడా జాగ్రత్త వహిస్తే ప్రమాదాలు నివారించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నుంచి బయటపడే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆర్.మద్దిలేటి, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెనమలూరు పాఠశాలలో విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

మిర్చి తోటల పరిశీలన

వత్సవాయి: మిర్చి రైతులు జెమినీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి బి.బాలాజీకుమార్ సూచించారు. మండలంలో భీమవరం, మక్కపేట, ఇందుగపల్లి గ్రామాల్లోని మిర్చి తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. జెమినీ వైరస్ సోకి పంట నష్టపోయిన రైతులు, తిరిగి మిర్చి నారును నాటుకునే సమయంలో నారును ఇమిడాక్లోప్రైడ్ లేదా వేపనూనెలో ముంచి నాట్లు వేస్తే మంచిదన్నారు. అలాగే వేపపిండి ఎకరాకు క్వింటా చొప్పున చల్లుకోవాలన్నారు. ఇప్పటికే ప్రైడ్ పిచికారీ చేసిన రైతులు పదే పదే అవే రకాల మందులను వాడకుండా ఉండాలన్నారు. మార్కెట్లో దొరికే మందులను విచ్చలవిడిగా పిచికారీ చేసి నష్టపోవద్దన్నారు. పంటసాగుకు సంబంధించి ఎప్పటికప్పుడు గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న ఉద్యానవశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యానవనశాఖాధికారి టి.వర్ధినీకుమారీ, సిబ్బంది దివ్య పాల్గొన్నారు.



మక్కపేటలో రైతులతో కలిసి పరిశీలిస్తున్న డీహెచ్‌వో బాలాజీ

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు సోమవారం 3వ ట్రాఫిక్ పోలీసులు 7 కేసుల్లో మద్యం తాగి వాహనములు నడిపే చోదకులను అరెస్టు చేసి ఏడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి వారికి జైలు, జరిమానా విధించారు. వారిలో ఒక వ్యక్తికి 10 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, ఒక వ్యక్తికి 07 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, ఒక వ్యక్తికి 02 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, మిగిలిన నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానా విధించారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నైజాంగేటు నూకల వారి వీధికి చెందిన మహ్మద్ జాఫర్, రిజ్వాన భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జాఫర్ వెల్డింగ్ పని చేస్తుంటాడు. రిజ్వాన భర్తపై అనుమానంతో తరుచూ గొడవకు దిగుతుంది. ఆదివారం సాయంత్రం కూడా ఇదే రీతిలో భార్యాభర్తలిద్దరికి గొడవ జరిగింది. సోమవారం ఉదయం నిద్రలేచిన జాఫర్ స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. అప్పటికే నిద్ర లేచిన రిజ్వాన పిల్లలకు టిఫిన్ చేసేందుకు వంట గదిలో ఉంది. కొంత సమయం తర్వాత బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చిన జాఫర్‌కు రిజ్వాన కనిపించలేదు. దీంతో జాఫర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బీమా నగదు అందజేత

చిట్టినగర్: వైఎస్సార్ బీమా కింద డివిజన్‌కు చెందిన షేక్.జిలాని కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయాన్ని అందచేసినట్లు 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మీ తెలిపారు. మట్టి ఖర్చుల కింద రూ. 10 వేలు అందించామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, దుక్కా దుర్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వీఎంసీ కౌన్సిల్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాల సంస్థ పాలక పక్షం మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించనున్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో సభ్యులు ఎజండాలో వచ్చిన అంశాలను చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఎజండాలో మొత్తం 127 అంశాలు, 11 ప్రశ్నలపై సభ్యులు అధికారులు చర్చించి తీర్మానాలు చేయనున్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): డివిజన్ వ్యాప్తంగా సోమవారం నుంచి నవంబర్ 5 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఏడీఆర్ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విధుల్లో పారదర్శకత, అవినీతి రహిత సేవలు అందిస్తామంటు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు అవినీతి రహిత భారతదేశం కోసం కృషి చేయాలని, విధుల్లో సమగ్రతతో పారదర్శకత ఉండేలా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఈ నెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని యునిటీ రన్, సెమినార్‌లు, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.శ్రీకాంత్, పలు బ్రాంచ్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలందించేందుకు కృషి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట 53వ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు అన్నారు. కొత్తపేట శిల్పాశ్రమంవీధి, అల్లాడివారి వీధిల్లో సుమారు పది లక్షల వ్యయంతో విద్యుత్ వైర్లు మార్పు, త్రీఫేస్ సదుపాయానికి సంబంధించిన ఏర్పాట్లకు పనులను ప్రారంభించారు. ఈ పనులను కార్పొరేటర్ అప్పాజీరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అందులో భాగంగా నూతన వైర్లు మార్పు స్తంబాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా అప్పాజీరావు మాట్లాడుతూ శిల్పాశ్రమం వీధి పరిసర ప్రాంతాల్లో త్రీఫేస్ లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత పనులు పూర్తయితే వారికి మంచి సేవలందించటానికి అవకాశముంటుందన్నారు. స్థానిక పెద్దలు పడాల రాజేష్, వాండ్రసి హర్ష, తొత్తడి దుర్గారావు, ప్రసాద్, నల్లబిల్లి మోహన్, వెంకట్రావు, గుండు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనలో 89 ఫిర్యాదులు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 89 ఫిర్యాదులు నమోదయ్యాయి. కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు రూరల్ డీసీపీ అజిత వేజెండ్ల స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి బాధితుల నుంచి వివిధ సమస్యలు, వినతులు స్వీకరించారు. నేరుగా బాధితులతో మాట్లాడారు. అదే విధంగా దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశాలు జారీ చేశారు. నగదు లావాదేవీలకు సంబంధించినవి 28 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలపై 14, సివిల్ వివాదాలు 15, వివిధ మోసాలపై 10, ఇంటి అద్దె సమస్యలపై 3, చోరీలపై 2 ఫిర్యాదులు, ఇతర చిన్న చిన్న వివాదాలపై 17 మొత్తం 89 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.